www.prajaprerana.co.in
RNI : APTEL/26/A3850

# ప్రజా ప్రేరణ న్యూస్

prajaprerana.2026@gmail.com

నిజం | నిష్పక్షపాతం | ప్రజా ప్రేరణ


రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
అక్షరానికి కొత్త అర్థం రాద్దాం..! నిజాన్ని నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకెళ్లాం..!!
కన్నది విన్నది తెలుసుకున్నది నలుగురికీ చేరేలా చేయాలనే తపన ఉందా?
ప్రజల సమస్యల్లో మమేకమై వారికి స్వరం అవుతూ జర్నలిజం రంగంలో మీ ముద్ర వేయాలనుకుంటున్నారా?
అయితే మీకోసం వచ్చింది ప్రజా ప్రేరణ..!
మా నినాదాలు
- నిజానికి మా కలం.. ప్రజలకు మా బలం
- ప్రతి వార్తలో నిజం.. ప్రతి అడుగులో ప్రజా ధ్వని
- ప్రజల స్వరం ప్రజా ప్రేరణ ధ్యేయం
- ప్రజల మాటే మా హెడ్లైన్
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ
9000449821,7661097651

సంపుటి : 01 సంచిక : 38 ప్రకాశం బుధవారం 08-07 -2026 ప్రకాశం నుంచి ప్రచురణ పబ్లిసర్ :కుందురు శ్రీనివాసరెడ్డి పేజీలు: 4 వెల : 2/-
Volume : 01 Issue : 38 PRAKASAM 08-07-2026 Publisher : KUNDURU SRINIVASA REDDY Pages :4 Rs : 2/-

# మహానేత..ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పేరు..

- సంక్షేమ పాలనకు శాశ్వత చిరునామా వైఎస్ రాజశేఖరరెడ్డి...
- పాదయాత్రతో ప్రజల కష్టాలను హృదయంలో నింపుకున్న నాయకుడు..
- ముఖ్యమంత్రిగా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన పాలన...
- రైతు నుంచి విద్యార్థి వరకు.. పేద నుంచి రోగి వరకు..
- ప్రతి ఇంటికీ చేరువైన సంక్షేమ యుగానికి నాంది పలికిన ప్రజానాయకుడి జయంతి..
















**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**

తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో కొన్ని పేర్లు కాలంతో పాటు మరింత బలంగా ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. అలాంటి అరుదైన నాయకుల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఒకరు. అధికారాన్ని హోదాగా కాకుండా ప్రజాసేవకు సాధనంగా భావించిన నాయకుడిగా, పేదల బాధను తన బాధగా తీసుకున్న ముఖ్యమంత్రిగా, రైతు కష్టాన్ని తన కష్టంగా భావించిన ప్రజానాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. సంక్షేమమే ప్రభుత్వానికి అసలైన అర్థమని తన పాలనతో చూపించిన నాయకుడిగా వైఎస్ రాజశేఖరరెడ్డి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.వైద్యుడి నుంచి ప్రజానాయకుడిగా నిలిచారు.1949 జూలై 8న జయమ్మ, రాజారెడ్డి దంపతులకు జన్మించిన వైఎస్ రాజశేఖరరెడ్డి బాల్యం నుంచే క్రమశిక్షణ, సేవాభావంతో ఎదిగారు. బళ్లారిలో పాఠశాల విద్య పూర్తి చేసి, విజయవాడలో ఉన్నత విద్య అభ్యసించారు. అనంతరం గుల్బర్గా వైద్య కళాశాలలో వైద్య విద్య పూర్తి చేసి, తిరుపతిలో హౌస్ సర్జన్‌గా శిక్షణ పొందారు. కొంతకాలం వైద్యుడిగా సేవలందించిన తర్వాత, ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు.ప్రతి ఎన్నికలోనూ విజయం,,1978లో పులివెందుల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభలో అడుగుపెట్టిన ఆయన, ఆ తర్వాత పోటీ చేసిన ప్రతి ఎన్నికలోనూ విజయం సాధించారు. పులివెందుల నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా, కడప నుంచి నాలుగు సార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై అరుదైన రికార్డు సృష్టించారు. గ్రామీణాభివృద్ధి, వైద్య, విద్య శాఖల మంత్రిగా పనిచేసిన ఆయన, రెండు పర్యాయాలు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, అనంతరం ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడారు.చరిత్ర సృష్టించిన పాదయాత్ర,,2003లో మండుటెండలను సైతం లెక్కచేయకుండా దాదాపు 1,460 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. వేలాది గ్రామాలు, వందలాది మండలాలు దాటి రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా విన్నారు. ప్రజలతో నేరుగా మమేకమైన ఆ పాదయాత్ర ఆయన రాజకీయ జీవితానికే కాదు, రాష్ట్ర రాజకీయాలకూ కీలక మలుపుగా నిలిచింది. అదే పాదయాత్ర 2004లో అధికారానికి దారి చూపింది.సంక్షేమానికి కొత్త నిర్వచనం, వైఎస్ రాజశేఖరరెడ్డి, 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. రైతే దేశానికి వెన్నెముక అన్న నమ్మకంతో వ్యవసాయానికి అండగా నిలిచారు. అనంతరం పేదల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని వరుసగా పలు పథకాలను అమలు చేశారు.ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యం పేదల గడపకు చేరింది. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న లక్షలాది మంది ఆర్థిక భారం లేకుండా చికిత్స పొందే అవకాశం కలిగింది. 108 అత్యవసర అంబులెన్స్ సేవలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.ప్రమాదం జరిగిన నిమిషాల్లోనే వైద్య సహాయం అందే వ్యవస్థను ఏర్పాటు చేశారు. 104 ఆరోగ్య సేవలు ద్వారా మారుమూల గ్రామాలకు వైద్యులను తీసుకెళ్లి పేదలకు వైద్యం అందించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా లక్షలాది మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్, వైద్య, డిగ్రీ, పీజీ విద్యను అభ్యసించే అవకాశం పొందారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆగిపోవాల్సిన పరిస్థితిని మార్చేశారు.జలయజ్ఞం పేరుతో భారీ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి, నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లక్షలాది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేశారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, సామాజిక భద్రత పథకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళల సాధికారత కోసం అనేక చర్యలు చేపట్టారు.రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన వైస్సార్.రైతు ఆత్మహత్యలు రాష్ట్రాన్ని కలవరపెడుతున్న సమయంలో రైతులకు ఉచిత విద్యుత్, పంటలకు ప్రోత్సాహం, సాగునీటి ప్రాజెక్టులు, రుణ సౌకర్యాలు, పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వ్యవసాయమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అన్న నమ్మకంతో రైతులకు అండగా నిలిచారు.అకాల మరణం.. రాష్ట్రాన్ని విషాదంలో ముంచిన ఘటన,,2009లో వరుసగా రెండోసారి ప్రజలు అధికార బాధ్యతలు అప్పగించారు. కానీ అదే ఏడాది సెప్టెంబర్ 2న చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తూ నల్లమల అడవుల్లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన మరణించారు. ఈ వార్త రాష్ట్రాన్ని ఒక్కసారిగా విషాదంలోకి నెట్టింది. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక అనేక మంది అభిమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలకు విస్తృత ప్రశంసలు లభించాయి. అదే సమయంలో భూవ్యవహారాలు, పరిపాలనా నిర్ణయాలు, అవినీతి ఆరోపణలు వంటి అంశాలపై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఆ ఆరోపణలకు సంబంధించి పలు న్యాయ, దర్యాప్తు ప్రక్రియలు కూడా కొనసాగాయి. అయినప్పటికీ ఆయన సంక్షేమ విధానాలు, ప్రజలతో ఉన్న అనుబంధం ఆయన రాజకీయ వారసత్వంలో ముఖ్యమైన అంశాలుగా నిలిచాయి. ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచినా రాజన్న..రాజకీయ నాయకుడిగా మాత్రమే కాదు, ప్రజల సమస్యలను వినే నాయకుడిగా, పేదల కష్టాల్లో అండగా నిలిచే వ్యక్తిగా, సంక్షేమ పాలనకు ప్రతీకగా వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుండిపోయారు. ఆయన అమలు చేసిన పథకాల ఫలితాలను పొందిన అనేక కుటుంబాలు ఇప్పటికీ ఆయనను స్మరించుకుంటుంటాయి. జూలై 8న జరిగే జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నివాళుల కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. మహానేత జ్ఞాపకాలను స్మరించుకుంటూ ప్రజలు ఆయనకు ఘన నివాళులు అర్పించనున్నారు.11











RNI : APTEL/26/A3850
ప్రజా ప్రేరణ న్యూస్
బుధవారం 08- 07-26

# ప్రశ్నించే గొంతులను అణచలేరు..

## ప్రజల కోసం పోరాటం ఆగదు...

## వైస్సార్సీపి రాష్ట్ర అధికార ప్రతినిధి మంచా నాగ మల్లేశ్వరి...

**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**



ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని, ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తడం తమ బాధ్యత అని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మంచా నాగ మల్లేశ్వరి స్పష్టం చేశారు. ప్రజల తరఫున మాట్లాడే స్వరాలను బెదిరింపులతోనో, కేసులతోనో, అణచివేత చర్యలతోనో మౌనంగా మార్చలేరని ఆమె పేర్కొన్నారు. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే వారిపైనే ఎదురు దాడికి దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని విమర్శించారు.రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ, వాటి పరిష్కారంపై దృష్టి సారించకుండా విమర్శలను అణచివేయడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆమె ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, రైతుల కష్టాలు, నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్న ఉద్యోగాలు, మహిళల భద్రత, సామాన్య ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారం వంటి కీలక అంశాలపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. అయితే ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రతిపక్ష స్వరాలను అణచివేయాలని చూడడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని అన్నారు.ప్రజల సమస్యలను ప్రస్తావించడం రాజకీయ విమర్శ కాదని, ప్రజల తరఫున తమ బాధ్యతను నిర్వర్తించడమేనని మల్లేశ్వరి పేర్కొన్నారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులు, వారి ఆశలు, ఆకాంక్షలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని చెప్పారు. ఆ బాధ్యతను నిర్వర్తించే వారిపై ఒత్తిళ్లు తీసుకురావడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలతో అపకీర్తి కలిగించే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధమని అన్నారు.ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే శత్రువులుగా చూడడం సరైన ధోరణి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం చేసే ప్రతి ప్రశ్నకు ప్రభుత్వం వాస్తవాలతో సమాధానం చెప్పాల్సిందేనని, అదే ప్రజాస్వామ్య సంస్కృతి అని పేర్కొన్నారు. ప్రశ్నించే హక్కును అణచివేయాలనే ఆలోచన ప్రజాస్వామ్య స్ఫూర్తినే దెబ్బతీస్తుందని, అధికారంలో ఉన్నవారు విమర్శలను సహించగలిగే స్థాయిలో ఉండాలని సూచించారు.రాష్ట్రంలో అనేక వర్గాల ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మల్లేశ్వరి పేర్కొన్నారు. రైతులు పంటలకు గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తున్నారని, యువత ఉద్యోగాల కోసం నిరీక్షిస్తోందని, మహిళలు అనేక సంక్షేమ పథకాల అమలుపై ప్రశ్నిస్తున్నారని, సామాన్య ప్రజలు పెరుగుతున్న ధరల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాల్సిన ప్రభుత్వం వాటిపై చర్చించకుండా ప్రశ్నించే వారినే లక్ష్యంగా చేసుకోవడం ప్రజల్లో మరింత అసంతృప్తికి దారితీస్తోందన్నారు.ప్రజల కోసం మాట్లాడే ప్రతి స్వరం ప్రజాస్వామ్యానికి బలం అని ఆమె పేర్కొన్నారు. ఆ స్వరాన్ని బలహీనపరచాలని చేసే ప్రతి ప్రయత్నం చివరికి ప్రజల తీర్పు ముందు నిలవదన్నారు. చరిత్రలో ఎన్నో సందర్భాల్లో ప్రజల గొంతును అణచివేయాలని ప్రయత్నించిన ప్రభుత్వాలు ప్రజలే తగిన గుణపాఠం చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.ప్రజల తరఫున ప్రశ్నించడం తమ హక్కు మాత్రమే కాదని, అది తమ బాధ్యత కూడా అని మల్లేశ్వరి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై గళమెత్తడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని, అధికారంలో ఎవరు ఉన్నా ప్రజా ప్రయోజనాల కోసం ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు.

# చెరగని చిరునవ్వు..

## ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత..

## 77వ జయంతి సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు

## సంక్షేమ పాలనకు కొత్త నిర్వచనం ఇచ్చిన నాయకుడి జ్ఞాపకాలు సజీవం..

## రైతు, పేద, బడుగు వర్గాల ఆశాకిరణంగా నిలిచిన ప్రజానాయకుడి సేవలను స్మరించిన ప్రజలు...




**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**

చెరగని చిరునవ్వు, నడకలో తెలుగుదనం ఉట్టిపడే రాజసం, ప్రజలను పలకరించే ఆప్యాయత, కష్టాల్లో ఉన్న వారి పట్ల అపారమైన మమకారం. ఇవన్నీ కలిపితే గుర్తుకు వచ్చే పేరు వైఎస్ రాజశేఖరరెడ్డి. అధికారాన్ని ప్రజాసేవకు సాధనంగా మార్చిన నాయకుడిగా, పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రిగా, సంక్షేమ పాలనకు కొత్త దిశ చూపిన ప్రజానాయకుడిగా ఆయన తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. జూలై 8న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 77వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆయనకు ఘన నివాళులు అర్పించేందుకు ఏర్పాట్లు జరిగాయి. పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, మొక్కల నాటకం, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మహానేత సేవల ను స్మరించుకుంటూ ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. వైద్యుడిగా ప్రజాసేవ ప్రారంభించిన వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజకీయాల్లో అడుగుపెట్టిన తర్వాత కూడా అదే సేవాభావాన్ని కొనసాగించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతాంగ సంక్షేమం, పేదల జీవనోన్నతి లక్ష్యంగా ప్రజల మధ్యే జీవించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలనే సంకల్పంతో చేపట్టిన పాదయాత్ర ఆయన రాజకీయ జీవితానికే కాదు, రాష్ట్ర రాజకీయాలకూ కీలక మలుపుగా నిలిచింది.ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సంక్షేమాన్ని ప్రభుత్వ పాలనలో కేంద్రబిందువుగా నిలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, 108 అంబులెన్స్ సేవలు, 104 ఆరోగ్య సేవలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పేదల ఆహార భద్రతకు చేపట్టిన చర్యలు వంటి అనేక కార్యక్రమాలు లక్షలాది కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయి. రైతు, పేద, విద్యార్థి, మహిళ, కార్మికుడు, వృద్ధుడు ఇలా ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఆయన పాలనకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచాయి.ప్రజలతో నేరుగా మమేకమవడం, సమస్యలు వినడం, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఆయన రాజకీయ శైలిలో ప్రత్యేకతగా నిలిచింది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మధ్యే ఉండాలనే ధోరణి ఆయనకు విశేష ప్రజాదరణ తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పొలాల్లోకి వెళ్లి మాట్లాడిన నాయకుడిగా, పేదల గడప దాటి వారి బాధలు తెలుసుకున్న నాయకుడిగా ప్రజలు ఇప్పటికీ ఆయనను గుర్తు చేసుకుంటున్నారు. 2009లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన అకాల మరణం రాష్ట్రాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఆ వార్తను జీర్ణించుకోలేక అనేక మంది అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# పులివెందులలో అడుగుపెట్టిన జగన్మోహన్ రెడ్డి..



**కదిలిన పార్టీ శ్రేణులు... నేడు ప్రజాదర్బార్..**

**రేపు ఇడుపులపాయలో మహానేత వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు..**

**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందులలో అడుగుపెట్టడంతో ఆ ప్రాంతం మరోసారి రాజకీయంగా సందడి చేసింది. హెలిప్యాడ్ నుంచి నేరుగా క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న జగన్, రెండు రోజుల కీలక పర్యటనను ప్రారంభించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన పులివెందులకు చేరుకున్నారు. నేడు క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్న జగన్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, వినతులను స్వీకరించనున్నారు. ప్రజలతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను తెలుసుకోవడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా మారింది. రేపు ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాల్లో జగన్ పాల్గొంటారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వైఎస్సార్‌కు ఘనంగా నివాళులు అర్పించనున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జయంతి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.జగన్ పర్యటన నేపథ్యంలో పులివెందుల, ఇడుపులపాయ ప్రాంతాలు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో కళకళలాడుతున్నాయి.రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకుంటుండటంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. జయంతి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశాయి.మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా జరిగే కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది. జగన్ రెండు రోజుల పర్యటనపై పార్టీ వర్గాల్లో ఉత్సాహం కనిపిస్తుండగా, ప్రజాదర్బార్‌కు కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# పులివెందుల ప్రజాదర్బార్‌కు పోటెత్తిన జనం..

- సమస్యలతో జగన్ వద్దకు ప్రజల వెల్లువ...
- సంక్షేమ పథకాలు అందడం లేదంటూ వినతుల వెల్లువ..
- ప్రజల తరఫున పోరాటం కొనసాగుతుందని జగన్ భరోసా..
- ఉపాధ్యాయుల టెట్ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని హామీ..
- రేపు ఇడుపులపాయలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు..



**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**

పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. భాకరాపురం క్యాంప్ కార్యాలయం ప్రజలతో కిక్కిరిసిపోయింది. జిల్లా నలుమూలలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను నేరుగా జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం నుంచే క్యాంప్ కార్యాలయం వద్ద బారులు తీరిన ప్రజలు, తమ వినతిపత్రాలను అందజేసేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు.ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ జగన్ వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదని, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, ఉపాధి, రైతు సమస్యలు, విద్య, వైద్యానికి సంబంధించిన అనేక అంశాలపై ప్రజలు తమ గోడును వినిపించారు. కూటమి పాలనలో పేదల కష్టాలు మరింత పెరిగాయని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల వినతులు ఆలకించిన జగన్ మాట్లాడుతూ, ప్రజల పక్షాన నిలబడటమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని చెప్పారు.ప్రజల సమస్యలపై పోరాటం ఆగదని, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల తరఫున గళం విప్పుతూనే ఉంటామని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు అందకుండా ఇబ్బందులు పడుతున్న ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల నమ్మకంతో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రతి అర్హ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ప్రజాదర్బార్‌లో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కూడా జగన్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. సర్వీసులో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను వర్తింపజేయడం సరైంది కాదని, బీఈడీ అర్హతతో ఉద్యోగంలో చేరి 25 ఏళ్లుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను మళ్లీ టెట్ పరీక్ష రాయాలని చెప్పడం అన్యాయమని వినతిపత్రం సమర్పించారు. కొత్త నిబంధనల వల్ల వేలాది మంది ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వివరించారు.ఈ అంశంపై స్పందించిన జగన్, ఉపాధ్యాయుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీల ద్వారా కేంద్రంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా అన్ని ప్రయత్నాలు చేస్తామని భరోసా ఇచ్చారు.ప్రజాదర్బార్‌లో మహిళలు, వృద్ధులు, రైతులు, యువత, దివ్యాంగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వివరించారు. ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత అంశాల వారీగా పరిశీలించాలని జగన్ పార్టీ నాయకులకు సూచించినట్లు సమాచారం. ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను నమోదు చేసి, వాటిపై నిరంతరంగా పోరాటం కొనసాగించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం జగన్ పులివెందుల నుంచి ఇడుపులపాయకు బయలుదేరనున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నివాళులు అర్పించనున్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జయంతి కార్యక్రమాల్లో పాల్గొంటారు.జగన్ పర్యటనతో పులివెందులలో రాజకీయ సందడి నెలకొంది. ప్రజాదర్బార్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు, క్యాంప్ కార్యాలయం వద్ద కనిపించిన రద్దీ, వరుసగా అందిన వినతిపత్రాలు, వివిధ వర్గాల ప్రతినిధులతో జరిగిన భేటీలు ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం తీసుకొచ్చాయి. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకోవడం, వివిధ వర్గాలకు భరోసా ఇవ్వడం ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# ఆదర్శ దాంపత్యానికి ప్రతీకగా నాగార్జున రెడ్డి దంపతులు..

## వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సయ్యద్ గౌస్ మొహిద్దీన్..

**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**



మార్కాపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కుందూరు నాగార్జున రెడ్డి, కల్పన దంపతులకు వివాహ వార్షికోత్సవం సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాంపత్య జీవితం అనేది పరస్పర నమ్మకం, ప్రేమ, ఆప్యాయత, త్యాగం, అవగాహనలపై నిలబడే పవిత్ర బంధమని పేర్కొన్నారు. ఆ విలువలను కుందూరు నాగార్జున రెడ్డి, కల్పన దంపతులు తమ జీవితంలో ఆచరణలో చూపిస్తూ ఆదర్శ దంపతులుగా నిలుస్తున్నారని కొనియాడారు.ప్రజా జీవితంలో ఎంతటి బాధ్యతలు నిర్వహించినా కుటుంబ విలువలకు ప్రాధాన్యం ఇస్తూ, ఒకరిపై ఒకరు చూపించుకునే ఆప్యాయత, పరస్పర గౌరవం, అనురాగంతో ముందుకు సాగుతున్న ఈ దంపతులు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కుటుంబ బంధాలను బలోపేతం చేస్తూ, సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. నాగార్జున రెడ్డి ప్రజా సేవలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ఆ సేవా ప్రయాణంలో కల్పన అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని తెలిపారు. ప్రజా జీవితంలో విజయవంతంగా ముందుకు సాగాలంటే కుటుంబ సభ్యుల అండ దండలు ఎంతో అవస రమని, ఆ విషయంలో ఈ దంపతులు ఒకరికొకరు బలంగా నిలుస్తున్నారని అన్నారు.ఇలాంటి ఆత్మీయ అనుబంధం, ప్రేమ, పరస్పర విశ్వాసం కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు.ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఆనందాలు, ఐశ్వర్యాలతో వారి వైవాహిక జీవితం మరింత వెలుగులు నింపాలని, ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# బీచ్‌లను మద్యం కేంద్రాలుగా మార్చొద్దు..



బీచ్ షాక్స్ వెంటనే రద్దు చేయాలి, మంచా నాగమల్లేశ్వరి...

ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :

విశాఖ బీచ్‌లలో ఏర్పాటు చేయనున్న బీచ్ షాక్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖలో మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. మంచా నాగమల్లేశ్వరి పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థినులు, ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన ఆమె, పర్యాటక అభివృద్ధి పేరుతో ప్రభుత్వం మద్యం సంస్కృతిని విస్తరించే ప్రమాదకర నిర్ణయాలు తీసుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. బీచ్ షాక్స్ పేరుతో మద్యం విక్రయాలకు ప్రోత్సాహం కల్పించడం మహిళల భద్రతకు, యువత భవిష్యత్తుకు, కుటుంబ వ్యవస్థకు తీవ్ర ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరి మాట్లాడుతూ, విశాఖ బీచ్‌లు రాష్ట్ర ప్రజల గర్వకారణమని, ప్రతిరోజూ వేలాది కుటుంబాలు, మహిళలు, చిన్నారులు, పర్యాటకులు సందర్శించే ప్రాంతాలను మద్యం వినియోగానికి కేంద్రాలుగా మార్చే ఆలోచనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చే కుటుంబాలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాల్సిన ప్రభుత్వం, మద్యం విక్రయాలకు అవకాశాలు కల్పించడం ద్వారా బీచ్‌ల స్వరూపాన్నే మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఒకవైపు మహిళల భద్రత, మహిళా సాధికారతపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు మహిళలు అధిక సంఖ్యలో సంచరించే బీచ్ ప్రాంతాల్లో మద్యం విక్రయాలను ప్రోత్సహించడం ఏ విధమైన పాలనో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలు సాయంత్రం వేళల్లో కూడా నిర్భయంగా విహరించే హక్కును ప్రభుత్వం కాపాడాల్సి ఉండగా, వివాదాలకు దారితీసే విధానాలను అమలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. మద్యం కారణంగా ఇప్పటికే అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. కుటుంబాల్లో కలహాలు, మహిళలపై హింస, రోడ్డు ప్రమాదాలు, నేరాల పెరుగుదల వంటి అనేక సమస్యలకు మద్యం ఒక ప్రధాన కారణమని ప్రజలు భావిస్తున్న తరుణంలో, బీచ్‌లలో మద్యం విక్రయాలకు ప్రభుత్వం అనుమతించడం సమాజానికి తప్పు సంకేతాలు పంపడమేనన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలంటే మౌలిక సదుపాయాలు పెంచాలని, పరిశుభ్రత, భద్రత, రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని, కుటుంబ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని సూచించారు. కానీ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి పేరుతో మద్యం వ్యాపారానికే ప్రాధాన్యం ఇవ్వడం విచారకరమన్నారు. పర్యాటక అభివృద్ధి అంటే మద్యం విక్రయాలు పెంచడం కాదని, ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పించడం అని గుర్తు చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకోకుండా ఏకపక్షం గా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని నాగమల్లేశ్వరి అన్నారు. బీచ్ షాక్స్‌పై ఇప్పటికే మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు, స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి స్వరాన్ని పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల మనో భావాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వాలు చివరకు ప్రజా తీర్పు ముందు నిలవలేవని హెచ్చరించారు. విశాఖ నగరానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాంటి నగరాన్ని మద్యం ఆధారిత వినోద కేంద్రంగా మార్చే ప్రయత్నాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరని స్పష్టం చేశారు. బీచ్‌లు కుటుంబాలు, పిల్లలు, మహిళలు, పర్యాటకులు ప్రశాంతంగా గడిపే ప్రదేశాలుగానే ఉండాలని, వాటిని మద్యం కేంద్రాలుగా మార్చడం వల్ల నగర ప్రతిష్ఠ దెబ్బతింటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఖజానా నింపుకోవడం కోసం ప్రజల భద్రతను, మహిళల గౌరవాన్ని, యువత భవిష్యత్తును పణంగా పెట్టడం పాలకులకు తగదన్నారు. ఆదాయం కోసం మద్యం విక్రయాలను మరింత విస్తరించడం కన్నా ప్రజల ఆరోగ్యం, కుటుంబాల సంక్షేమం, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీచ్ షాక్స్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని ప్రజల అభిప్రాయాలను గౌరవించాలని నాగమల్లేశ్వరి డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండివైఖరిని కొనసాగిస్తే మహిళలు, ప్రజా సంఘాలు, యువజన సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. మహిళల భద్రత, కుటుంబ వ్యవస్థ పరిరక్షణ, సమాజ ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల ఆకాంక్షల కోసం వైఎస్సార్సీపీ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.









# ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన..

పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచనలు...

17వ వార్డులో కమిషనర్ తనిఖీ..





ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను వేగంగా పరిశీలించి, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో అధికారులు చేపడుతున్న చర్యలు అభినందనీయమని పలువురు స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో 17వ బ్లాక్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి షేక్ కరీముల్లా, 17వ వార్డు అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జెండా మోసిన కార్యకర్తకు కన్నీళ్లు..

జెండా మార్చిన నాయకుడికి పదవులు..!

ఇదేనా నేటి రాజకీయాల అసలు ముఖం..?

ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :

రాజకీయ పార్టీలకు వెన్నెముకగా నిలిచే సామాన్య కార్యకర్తల త్యాగాలకు నేటి రాజకీయాల్లో విలువ తగ్గిపోతోందనే ఆవేదన రోజురోజుకూ పెరుగుతోంది. పార్టీ సిద్ధాంతాలను నమ్మి, జెండాను భుజాన వేసుకుని ఎండనక, వాననక ప్రజల్లో తిరిగే కార్యకర్తలు గుర్తింపుకోసం ఎదురు చూస్తుంటే, అధికారాన్ని చూసి పార్టీలు మారే అవకాశవాద నాయకులు మాత్రం పదవులు, ప్రాధాన్యం, అధికార హోదాలు అందుకుంటు న్నారనే విమర్శలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నా యి. ఒక పార్టీ కష్టకాలంలో కార్యకర్తలే మొదటి సైనికులుగా నిలుస్తారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తారు. సభలు, సమావేశాలు, నిరసనలు, ఆందోళనల్లో ముందుంటారు. ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటారు. ఎన్నో అవమానాలు భరిస్తారు. కుటుంబానికి దూరంగా ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తారు. అయినా ఎన్నికలు ముగిసిన తర్వాత వారి పేరు కూడా గుర్తుకు రాని పరిస్థితులు అనేక చోట్ల కనిపిస్తున్నాయని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం రక్తం, చెమట చిందించిన కార్యకర్తకు ఒక చిన్న గుర్తింపు కూడా దక్కని సందర్భాలు ఉంటే, ఎన్నికల ముందు ఒక పార్టీ, ఎన్నికల తర్వాత మరో పార్టీ జెండా పట్టుకున్న నాయకులకు మాత్రం రెడ్ కార్పెట్ పరుస్తున్న దృశ్యాలు రాజకీయాల్లో సాధారణమైపోయాయని విమర్శలు వినిపిస్తున్నాయి. నిన్నటి వరకు ఒక పార్టీపై తీవ్ర విమర్శలు చేసిన వారే, ఈరోజు అదే పార్టీలో చేరగానే పదవులు, ప్రాధాన్యం పొందడం సామాన్య కార్యకర్తల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సిద్ధాంతాల కోసం నిలబడిన వారికంటే, అవకాశాల కోసం జెండాలు మార్చిన వారికే ప్రాధాన్యం దక్కుతోందనే భావన అట్టడుగు స్థాయి కార్యకర్తల్లో పెరుగుతోంది. పార్టీ కోసం జైలుకు వెళ్లినవాడు, లాఠీ దెబ్బలు తిన్న వాడు, ఆర్థికంగా నష్టపోయినవాడు, కుటుంబాన్ని పక్కన పెట్టి రాజకీయ జీవితాన్ని గడిపినవాడు చివరికి ప్రేక్షకుడిగా మిగిలిపోతుంటే, రాజకీయ లెక్కల కోసం వచ్చినవారు నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరడం కార్యకర్తల్లో తీవ్ర నిరాశను కలిగిస్తోందని అంటున్నారు. ఎన్నికల సమయంలో "కార్యకర్తలే పార్టీకి ప్రాణం", "కార్యకర్తలే బలం", "కార్యకర్తలే నాయకులు" అనే నినాదాలు మార్మోగుతాయి. కానీ అధికారం వచ్చిన తర్వాత అదే కార్యకర్తలు కార్యాలయాల గుమ్మాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శలు ఉన్నాయి. పార్టీని నమ్ముకుని జీవితాన్ని అంకితం చేసిన వారికి సమయం లేకపోయినా, కొత్తగా చేరిన నాయకులకు ప్రత్యేక మర్యాదలు, ప్రత్యేక అవకాశాలు లభించడం అట్టడుగు స్థాయి శ్రేణుల్లో అసంతృప్తిని పెంచుతోందని పేర్కొంటున్నారు. రాజకీయాల్లో సిద్ధాంతం, నిబద్ధత, త్యాగం అనే పదాలకు క్రమంగా విలువ తగ్గిపోతుండగా, అవకాశవాదం కొత్త రాజకీయ సంస్కృతిగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ వైపు వెళ్లడం, ఆ వెంటనే పదవులు పొందడం, కీలక బాధ్యతలు చేపట్టడం ఇప్పుడు కొత్త ధోరణిగా మారిందనే చర్చ జరుగుతోంది. ఈ పరిస్థితి కొనసాగితే పార్టీని నమ్ముకుని కష్టపడే కార్యకర్తల్లో నిస్పృహ పెరిగే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఒక పార్టీ జెండాను గౌరవంగా మోసిన చేతులకు విలువ లేకుండా, అదే జెండాను నిన్న విమర్శించిన చేతులకు పదవులు కట్టబెట్టడం ఏ సందేశం ఇస్తోందని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.





పదవులు మారొచ్చు. ప్రభుత్వాలు మారొచ్చు. రాజకీయ సమీకరణాలు మారొచ్చు. కానీ పార్టీ కోసం త్యాగం చేసిన కార్యకర్త చరిత్ర మారదని వారు గుర్తు చేస్తున్నారు. పార్టీ కార్యాలయాల నిర్మాణం నుంచి గ్రామస్థాయి సమావేశాల వరకు, పోస్టర్లు అంటించడం నుంచి ప్రజా సమస్యలపై పోరాటాల వరకు ప్రతి అడుగులో కార్యకర్తే ముందుంటాడు. ఓటమి వచ్చినప్పుడు పార్టీని విడిచి వెళ్లకుండా నిలబడేది కూడా కార్యకర్తే. అలాంటి కార్యకర్తను పక్కన పెట్టి అవకాశవాద రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తే పార్టీ పునాదులే బలహీనపడే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాజకీయాల్లో నిజమైన బలం నాయకులు కాదని, కార్యకర్తలేనని ప్రతి పార్టీ గుర్తించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. జెండా మోసిన కార్యకర్త గౌరవంగా తలెత్తుకుని నిలబడే రోజే రాజకీయాలకు నిజమైన విలువ వస్తుందని, అవకాశవాదానికి కాకుండా నిబద్ధతకు గుర్తింపు లభించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజా ప్రేరణ న్యూస్
RNI : APTEL/26/A3850
బుధవారం 08- 07-26

# తన అభిమాన నాయకుడు వైఎస్సార్‌కు జన్మదిన నివాళులు...







## మార్కాపురం టౌన్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్ సిరాజ్..

**ఏపీ బ్యూరో /జూలై 07, (ప్రజా ప్రేరణ):**

ప్రజా సంక్షేమ పాలనకు చిరునామాగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా మార్కాపురం పట్టణం 9వ బ్లాక్ మాజీ కౌన్సిలర్ సిరాజ్ ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ, వైఎస్సార్ పేరు వినగానే ప్రజల సంక్షేమం, రైతుల సంక్షేమం, పేదల అభ్యున్నతి, సామాజిక న్యాయం గుర్తుకు వస్తాయని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని పేర్కొన్నారు.ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాలు రాష్ట్ర అభివృద్ధిలో మైలురాళ్లుగా నిలిచాయని కొనియాడారు.వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని, ఆయన చూపిన సేవా మార్గం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని సిరాజ్ పేర్కొన్నారు. అధికారాన్ని ప్రజాసేవకు వినియోగించి, ప్రతి కుటుంబం సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేసిన అరుదైన నాయకుడు వైఎస్సార్ అని అన్నారు.ప్రజల పట్ల అపారమైన ప్రేమ, రైతుల పట్ల అంకితభావం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి కారణంగానే వైఎస్సార్ నేటికీ ప్రతి ఇంట్లో స్మరించబడుతున్నారని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని సిరాజ్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సిరాజ్, ఆయన ఆశయాలు శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటాయని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలనే తపనతో జీవించిన మహానేతకు జన్మదిన సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన స్ఫూర్తి చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించారు.14

# ఆదర్శ దాంపత్యానికి చిరునామా నాగార్జున రెడ్డి - కల్పన దంపతులు...

**వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలతో అభినందనలు తెలిపిన ఆత్మీయులు...**

**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**

మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.పి. నాగార్జున రెడ్డి, కల్పన దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయులు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య బంధం మరెన్నో వసంతాలు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచిన నాగార్జున రెడ్డి, కల్పన దంపతుల దాంపత్య జీవితం ప్రతి కుటుంబానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.కాలం గడిచే కొద్దీ వారి అనుబంధం మరింత బలపడుతూ, కుటుంబ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగుతున్న తీరు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు.ప్రజా జీవితంలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్న నాగార్జున రెడ్డికి, ప్రతి అడుగులో కల్పన అండగా నిలుస్తూ కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజాసేవ, కుటుంబ జీవితం రెండింటినీ సమతుల్యంగా కొనసాగిస్తున్న వారి ప్రయాణం చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించారు.భగవంతుని అనంత కరుణాకటాక్షాలతో ఈ దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలతో జీవించాలని, వారి జీవితంలో ప్రతి రోజు కొత్త ఆనందాలకు, ప్రతి అడుగు కొత్త విజయాలకు నాంది, కావాలని కోరుకున్నారు. ప్రజల ఆదరణ, అభిమానంతో వారు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా, పత్తి రవిచంద్ర , లుంజల శేఖర్, కుందురు శ్రీనివాసరెడ్డి, అయూబ్ అలీ, అసిఫ్ ఖాన్, కొలగట్ల శివారెడ్డి, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమకు ప్రతిరూపంగా, అనురాగానికి చిరునామాగా, ఆదర్శ దాంపత్యానికి నిదర్శనంగా నిలిచిన నాగార్జున రెడ్డి, కల్పన దంపతులు ఇలాగే కలకాలం ఆనందంగా జీవించాలని, భగవంతుని ఆశీస్సులతో వారి కుటుంబంలో సిరిసంపదలు, శాంతి, సౌభాగ్యాలు నిత్యం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.






# బూతు మాటలు మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు ఎక్కడ..?






## ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వారిపైనే పోలీసుల ప్రతాపం..!

## పులివర్తి నానిని వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్..

## ఎస్పీ కార్యాలయానికి భారీ ర్యాలీ.. అడ్డుకున్న పోలీసులు..

## తోపులాట.. పలువురికి గాయాలయ్యాయని ఆరోపణ..

**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**

ఎమ్మెల్యే పులివర్తి నాని చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగింది. బూతు మాటలు మాట్లాడిన ఎమ్మెల్యేపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తూ తిరుపతిలో భారీ ఆందోళనకు దిగింది. జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందించేందుకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరగా, ఎస్పీ కార్యాలయానికి చేరకముందే పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ప్రజాస్వామ్యబద్ధంగా వినతిపత్రం అందించేందుకు వచ్చిన తమకు కనీస అవకాశం కూడా కల్పించలేదని వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్పీ కార్యాలయం ప్రధాన ద్వారం వద్దనే చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో అక్కడ భారీ ఉద్రిక్తత నెలకొంది. నిరసనను చెదరగొట్టేందుకు పోలీసులు బలప్రయోగానికి దిగారని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. కార్యకర్తలను బూటు కాళ్లతో తొక్కుతూ, లాఠీలతో కొడుతూ, ఈడ్చుకెళ్లారని ఆరోపించింది. ఈ ఘటనలో పలువురు నాయకులు, కార్యకర్తలకు రక్తగాయాలు అయ్యాయని, గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపింది. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని, అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బూతులు మాట్లాడిన ఎమ్మెల్యేపై ఒక్క చర్య కూడా తీసుకోకుండా, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ప్రతిపక్ష నేతలపైనే పోలీసులు ప్రతాపం చూపడం ఏ న్యాయమని ప్రశ్నించారు. పోలీసులు చట్టాన్ని అమలు చేస్తున్నారా, లేక అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారా అని నిలదీశారు. అధికార పార్టీకి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయం అమలు చేస్తున్నారనే భావన ప్రజల్లో బలపడుతోందని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది.ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రతిపక్ష గొంతును అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించింది. బూతు వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే పులివర్తి నానిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది.ఈ ఘటనతో తిరుపతి రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ పట్టుబడుతుండగా, పోలీసుల వ్యవహారశైలిపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అయితే, వైఎస్సార్‌సీపీ చేసిన ఆరోపణలపై పోలీసులు, అలాగే ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందన వెలువడాల్సి ఉంది.





# వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టేశారు..

## రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారు...

## రెండేళ్లుగా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా బకాయిలే..

## అన్నదాతకు అండగా నిలవని ప్రభుత్వం...

## రైతు ఆత్మహత్యలకు బాధ్యత ఎవరిది..

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు తప్పవు..

## వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి...

**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతాంగం అన్ని విధాలుగా నష్టపోయిందని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. రెండేళ్లుగా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, వ్యవసాయానికి పెద్దపీట వేస్తామని, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం చెప్పిన మాటలు కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, బీమా, సబ్సిడీలు సకాలంలో అందడం లేదని ఆరోపించారు.రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిన్నప్పటికీ రైతులకు తగిన పరిహారం అందలేదని చెప్పారు. అనంతపురం జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన దాదాపు రూ. 120 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.రైతులు బీమా ప్రీమియం చెల్లించినప్పటికీ పరిహారం మాత్రం అందలేదని ఆరోపించారు.వైఎస్ జగన్ పాలనలో ఉచిత పంటల బీమా అమలైందని, ఐదేళ్లలో రైతులకు రూ.1,160 కోట్ల పంటల బీమా, రూ.436 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ విధానాన్ని నిలిపివేయడంతో రైతులు తీవ్ర నష్టపోతున్నారని విమర్శించారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటినా జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణంలో స్వల్ప భాగంలో మాత్రమే పంటలు సాగయ్యాయని అన్నారు. 8 లక్షల 65 వేల ఎకరాల సాధారణ సాగులో ఇప్పటి వరకు కేవలం 1 లక్షా 38 వేల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందని, అధికారిక లెక్కల ప్రకారమే 7 లక్షల 10 వేల ఎకరాలు బీడుగా ఉన్నాయని తెలిపారు.సబ్సిడీ వేరుశనగ విత్తనాల సరఫరా భారీగా తగ్గిందని, ప్రకటించిన మేరకు కూడా




రైతులకు అందలేదని ఆరోపించారు. సరఫరా చేసిన విత్తనాల్లో కూడా నాణ్యత లోపాలు ఉన్నాయని, మరోవైపు ఎరువుల ధరలు పెరగడంతో చిన్న, సన్నకారు రైతులపై అదనపు భారం పడుతోందన్నారు.ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం లేదని విమర్శించారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల తరఫున ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించి వారికి మానసిక ధైర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.రైతుల ఆత్మహత్యలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండేళ్లలో 160 మంది రైతులు, ఒక్క అనంతపురం జిల్లాలోనే 75 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. బాధిత కుటుంబాలకు ఇవ్వాల్సిన ఆర్థిక సాయం కూడా అందలేదని విమర్శించారు.

# సొంత పార్టీ నేతతోనే కేంద్ర మంత్రికి షాక్..

**భోగాపురం రోడ్డుపై రామ్మోహన్ నాయుడి కాన్వాయ్‌కు అడ్డుకట్ట..**

**నష్టపరిహారం ఎప్పుడిస్తారు అంటూ నిలదీసిన కర్రోతు బంగారు రాజు..**

**కొంతసేపు కారులోనే కేంద్ర మంత్రి,, పోలీసుల జోక్యంతో అక్కడి నుంచి కాన్వాయ్..**

**ఏపీ బ్యూరో / జులై 07, ప్రజా ప్రేరణ :**భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్వాసితుల నష్టపరిహారం వివాదం అధికార పార్టీని ఇరకాటంలో పడేసింది. నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై ఈసారి ప్రతిపక్షం కాదు, అధికార పార్టీకి చెందిన కీలక నేతే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని నడిరోడ్డుపై అడ్డుకుని నిలదీయడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంతంలో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కాన్వాయ్‌ను మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగారు రాజు అడ్డుకున్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఎందుకు అందలేదని, ఇంకెన్ని రోజులు హామీలతోనే కాలం గడుపుతారని వరుస ప్రశ్నలు సంధించారు.

PRAJA PRERANA ,APTEL/26/A3850,Registration Number TELUGU DAILYKUNDURU SRINIVASA REDDY Publisher 9000449821 D NO 1-145-B, NOORANI MASEED, RTC BUS STATION BACK SIDE, PRAKASAM, ANDHRA Address PRADESH - 523316.D NO 1-145-B, NOORANI MASEED, RTC BUS STATION BACK SIDE, MARKAPUR,Place of Publication PRAKASAM, ANDHRA PRADESH - 523316.MADDINENI NAGESWARA RAOP rinter BUILD-ING NO. 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. Address : SUNDAY PRINTING PRESS Printing Press (Name & Address) DOOR NO 1-94, KONETI BAZAR, PRAKASAM, ANDHRA PRADESH - 523316. KUNDURU SRINIVASA REDDY Owner D NO 1-145-B, NOORANI MASEED, RTC BUS STATION BACK SIDE, PRAKASAM, ANDHRAPRDESH